మొదటినుంచీ కూడా ఫలాని చోట రాజధాని ఏర్పడాలని విస్పష్టంగా అంటూవచ్చారు. వారిని ప్రతిఘటించటానికి—వారిసూచన చాలా ఘోరమైనదీ, ఆంధ్రకు విపత్కరమైనదీ అయినట్టు! మిగిలిన రాజకీయవర్గాలవారు తమ శక్తులన్నిటినీ కూడదీశారు.

రేపు ఆంధ్ర శాసనసభలో ఎవరైనా రాజధాని మార్పుగురించి ప్రతిపాదిస్తే వాళ్ళు ఈ ప్రభుత్వాన్ని కూలదోయటానికి యత్నించే "బూర్జువా" విద్వేషులవుతారు! ఎంత దారుణం! పసిగర్ల వాడి కళ్ళు! కర్నూలు రాజధానిని వ్యతిరేకించిన వారంతా రాయలసీమకు శత్రువులుగా కనిపిస్తారు. ఆంధ్ర కంతటికీ వెనకబడి ఉన్న రాయలసీమ అభివృద్ధి అత్యవసరమైనదే. కాని హిరణ్యంఅంటూ కానీ ఇచ్చినట్టు రాయలసీమకు రాజధాని ఇచ్చారు.

ఆంధ్రను పైకి తీసుకురావడానికి అన్ని రాజకీయపక్షాలూ ఇవాళ ఏకం కాలేకపోతే ఇక ఎన్నటికీ ఏకం కాలేరు. ఆంధ్ర క్షేమాన్ని గురించి జరిగే ఏ సూచననుగాని రాజకీయ కారణాలవల్ల తోసివేసే దేశద్రోహులు అధికారంలో ఉంటే ఆంధ్రకు ముక్తి లేదు.

స్కెచ్

# పాతకాలపు పంకజం

బదరినాథ్

"ఆస్పత్రిలో మొగపిల్లవాణ్ణి ప్రసవించి పంకజం చచ్చిపోయిందట" అని మా అమ్మ అన్న మాటలు విని నమ్మలేకపోయాను. పైగా నవ్వేను కూడా.

"నీకేం బుద్ధిలేదుట్రా. పంకజం చచ్చిపోయిందంటే నవ్వులాటగావుందా నీకు" అని ఆవిడ తీక్షణంగా అన్నతర్వాత యిక నాకు నమ్మక తప్పింది కాదు.

నాకేకనక అధికారం అంటూ వుంటే పంకజాన్ని అకారణంగా చంపినందుకు దేవుడికి తప్పకుండా ఉరిశిక్ష విధించివుండేవాణ్ణే. దేవుడు తల్చుకుంటే యెవరికైనా యెంతైనా, అన్యాయం చెయ్యగలడో, పంకజం విషయంలో అంత అన్యాయమూ చేసేడు. ఈ అభియోగంలో దేవుడే నిరాక్షేపణీయంగా నిందితుడు. న్యాయస్థానంలో చేతులుకట్టుకుని బోనులో నిలబడవలసిన ముద్దాయి.

...చిన్నతనంనుంచీ ఒకదగ్గిరే పెరిగాం, ఒక చోటనే ఆడుకున్నాం, ఒక మాటనే అనుకున్నాం, ఒకపాటనే పాడుకున్నాం-నేనూ పంకజమూ. అలాంటి పంకజం చూస్తూండగానే ఒక బిడ్డకి తల్లి అయింది. రెండోవాడు భూమ్మీద పడీపడడంతోటే అమ్మని ఆలోకానికి పంపాడు.

ఈ ఆలోచనల్లో చొక్కామీదపడ్డ కన్నీటి బిందువుల వేడి ఒంటికి తగలడంతోటే, స్పృహలో పడి మా స్నేహానికి స్మృతిచిహ్నాలైన గోదావరి యిసుకతిన్నె దగ్గరకు దాటితీసేను.

పదేళ్ళ పంకజమూ, పదిహేనేళ్ళ నేనూ ఎన్ని సంధ్యా సమయాలు ఆసైకతాలమీద గడిపామో జ్ఞప్తివస్తే పంకజం నా ప్రక్కనేవున్నట్లనిపించింది నాకు. పంకజమూ, నేనూ, పందేలేసుకుని పరుగెడుతున్నట్టే వుంది. రెండుచేతుల్తోటీ యిసకని వెదజల్లుతూ, కొంటెతనంగా నా తల నిండా పోసి, మళ్ళీ జాలితలిచి యిసకని దులుపుతున్నప్పటి పంకజం చేతులు యింకా తలపైనే వున్నట్లనిపించింది నాకు.

'దూముంపుల్ల' ఆడటంలో పంకజానిది అందె వేసిన చెయ్యి. నేనిసకలో దాచినపుల్లని తను సునాయాసంగా చిక్కించుకోగలిగేది, కాని తను దాచిన పుల్లని వెదుక్కోవడమాత్రం నాకు మహాచిక్కుగా వుండేది.

వాళ్ళమ్మచేసిన చక్కిలాలు రహస్యంగా తీసుకొచ్చేది పంకజం. నేనూ, తనూ, ఒకళ్ళకేసి ఒకళ్లు చిలిపిగా చూచుకొంటూ, వాట్ని కరకర లాడించేవాళ్ళం. ఎవరిచక్కిలం ఎంతయెక్కువ కరకరలాడితే వాళ్ళంత గొప్పవాళ్ళని భావించు

కునేవాళ్ళం. కాని ఆ చక్కిలాలు, మా చక్కని చూపులూ, అక్కడనే యిసకలో రాలిపోయినై.

వంటచేసుకునే మా అమ్మకి పంకజం యెన్నో విధాల సాయంచేసేది. బియ్యం కడిగి తెచ్చి యిచ్చేది. కూరముక్కలు తరిగి పెట్టేది. పచ్చడి కోసం దాచిపెట్టిన కొబ్బరిచెక్కని చిన్నచిన్న ముక్కలుగాచేసి రోటిదగ్గర సిద్ధంగా వుంచేది. మా అమ్మకి తెలుసు-పంకజానికి కొబ్బరిపచ్చడంటే చాలాయిష్టమని. అందుకనే చెయ్యడంతోటే నిమ్మకాయంతముద్ద తనచేతులో పడేసేది. దాంతోటి నన్ను ఊరించి, ఊరించి, బుల్లించి తినేది. నాకు కోపంవచ్చి జడపుచ్చుకులాగేవాణ్ణి. బుంగమూతిపెట్టి కోపంగా మా అమ్మతో ఫిర్యాదు చేసేది.

“తప్పు కాదురా-ఆడపిల్ల ఒంటిమీద చెయ్యేస్తావా!”అని ఆవిడన్నప్పుడు పంకజం చంకలెగరేసుకుంటూ నన్ను మరింత కవ్వించేది.

అల్లానే నాలుగేళ్లు దొర్లినయ్. ఒకరోజున యెక్కణ్ణుంచో యింటికొచ్చేసరికి మా అమ్మ నాచేతిలో యింత చిమ్మిలి పెట్టింది.

“ఎక్కడిదమ్మా?” అనడిగాను.

“పంకజం చేయించిందిరా”అందిఅమ్మనవ్వుతూ

“ఎందుకూ? తనే పరీక్షలు పేసయిందీ చిమ్మిలి పార్టీ చేసేందుకు?” అన్నాను అయోమయంగా.

“ఏడిశావ్” అని అమ్మ నవ్వేసి ఊరుకుంది.

“నాకేం అర్థంకాలేదు నువ్వు చెప్పింది” అన్నాను.

“ఇప్పుడు నీకర్థం అవకపోతే వచ్చిన యిబ్బందేంలేదు లే” అనావిడ అనడంతోటే ఆత్మాభిమానం దెబ్బతిన్నమాట నిజం.

గోదావరి తిన్నెలమీద పంకజంలేకుండగా, కూర్చోవడం నాకది మొదటిసారీ, ఆఖరుసారీ కూడా. నాకేమీ తోచలేదు. పంకజాన్ని నా నుంచి యెవరో బలాత్కారంగా దూరం చేస్తున్నట్టు యెంతో బాధపడ్డాను.

ఆరోజున తలంటిపోసుకుని, గాలి కెగురుతూన్న కురుల్ని మునివేళ్ళతో విడదీసుకుంటూన్న పంకజాన్ని పరికించగానే “కురుల్ తడియార్చుచు కూరుచున్న అభ్యంగన మంగళాంగి” అన పద్యం ఒక్కసారి హఠాత్తుగా జ్ఞప్తికొచ్చింది. నాలో అంతర్గతంగావున్న కవిత్వం ఒక్కసారి వెల్లువలా ఉప్పొంగింది. నాకలం ఆ రోజున తాళం తప్పకుండగా సాహిత్యనృత్యం చేసింది; ఆక్షణంలో నాలో రేకెత్తిన కొన్నిభావాలు యెనుములేని కవికుమారుణ్ణిగా చేసినయ్ నన్ను అనుకున్నాను.

ఆరోజునుంచీ పంకజం మా యింటికి రావడం తగ్గింది. అందుక్కారణం ఊహించుకోలేనంత చిన్నవాణ్ణి కానప్పుడు నేను.

ఆరుమాసాలైనా తిరక్కుండానే పంకజానికి పెళ్ళి స్థిరపడింది. వరుడు బియ్యే పేసై విశాఖపట్నంలో యేదో ఉద్యోగం చేస్తున్నాడు. అందరూ బాగానే వుందన్నారు. పెళ్ళికూడా వైభవంగానే జరిగింది. పెళ్ళయినా రెండో నెల్లోనే పంకజం కాపరాని కెళ్ళాల్సొచ్చింది. వెళ్తూ, వెళ్తూ మా యింటికొచ్చింది చెప్పిపోదామని. “వెళ్ళిరా అమ్మా. వెయ్యేళ్లూ వెళ్ళబతికి వెయ్యిమంది బిడ్డల్నికని...” అని మా అమ్మ యింకా యేవో ఆశీర్వదించబోతోంటే “అయ్యబాబోయ్ వెయ్యిమందే”అని నేననగానే పంకజం గట్టిగా నవ్వింది. ఆ నవ్వు యీనాటికీ నా హృదయంలో ముకుళించని పువ్వుగానే నిలిచిపోయింది.

మరుసటిసంవత్సరం మొదటిపురుడు పుట్టింట్లో పోసుకోవాలని పంకజం మా ఊరొచ్చింది. పనసపండులాంటి చక్కటిపిల్లాణ్ణి కన్నది. ఒకరోజున నేను చూడ్డానికెళ్ళాను. పాపాయిని నాకు గర్వంతో చూపిస్తూ, “ఎలావున్నాడు?”అనడిగింది.

“అచ్చంగా పంకజం పోలికే”అన్నాను.

“ఇంకా నీ చిన్నప్పటి చిలిపితనం పోలేదూ” అన్నది మందలిస్తున్న స్వరంతో పంకజం—తను మహాపెద్దదైనట్టు.

“ఏం పేరు పెట్టమంటావ్?”అనిసలహా అడిగింది“మీ మావగారిదో,నాన్నగారిదో పెట్టండి” అన్నాన్నేను.

“ఈమాత్రం మహా నువ్వు చెప్పేదేవిటి? మా అబ్బాయిపేరు పెద్ద సినిమాయాక్టరులావుండాలి” అంది అమాయకంగా.

“అయితే ‘ఆనంద్’ అని పెట్టు”అన్నాను. ఈ పేరువిని చాలా ఆనందించింది పంకజం. నిన

రికి బారసాలలో మొగుడితోకూడా హోరాహోరీని దెబ్బలాడి ఆపేరు పెడితేనేకాని వీల్లేదని, చంటిపిల్లలా మారాంచేసి మరీ ఆపేరు పెట్టించినట్టు తర్వాత మా అమ్మ నాతో చెప్పింది.

పిల్లాణ్ణెత్తుకుని విశాఖపట్నం వెడుతున్న పంకజం "వెళ్ళొస్తానోయ్ బ్రతికంటూ వుంటే నీపెళ్లికి తప్పక వస్తాలే!" అన్నది. ఆ మాటన్నందుకు మా అమ్మా వాళ్ళమ్మాకూడా పంకజాన్ని కూకలేశారు.

"అన్నంత మాత్రంలో అన్నీ జరుగుతాయేవిటమ్మా" అని పంకజం నిర్లక్ష్యంగా అనేసి వూరుకుంది. కాని అన్నమాటలు అక్షరాలా అలానే జరిగినై. అప్పుడే రెండో కాన్పురావడం ఆ సమయంలో పంకజం ప్రాణాలువదలడం, ఒక్క క్షణంలో జరిగిపోయింది. ఆ నాడు పంకజం ఆ మాట అనకపోయినా బాగుండునేమో అనిపిస్తోంది నాకిప్పుడు. కాని అనడం, జరగడం, అన్నీ అయినాక యేమనిపిస్తేమాత్రం యేంలాభం?

నిన్న మొన్నటిదాకా నాతో కలిసిమెలిసి తిరిగిన పంకజం యివ్వాళ చూపులక్కూడా కరువైంది. గోదావరి సైకతాలమీద పదేళ్ళ పంకజం కట్టిన పిచ్చికగూడు చెక్కుచెదరకుండా యింకా అలానే వున్నట్టుంది. పరుగెత్తిన పంకజం పాదచిహ్నాలు యిసకలో అలానే చెరిగిపోకుండా నిలిచివున్నాయనిపించింది. నేనూ, పంకజం కట్టిన పిచ్చికగూడూ, పంకజం పాదచిహ్నాలూ, సైకతమూ, దేవుణ్ణి కసిదీరా తిట్టాం-పంకజాన్ని మాకు లేకుండగా తనుతీసుకుపోయినందుకు. నేనూ, పంకజమూ అక్కడ ఆడిన ఆటలూ, పాడినపాటలూ నమిలిన చక్కిలాలూ, తెచ్చుకున్న కొబ్బరి ముక్కలూ— అన్నీ అదోలీలగా, ఛాయా మాత్రంగా మాత్రమే ఆ ప్రదేశంలో నాకు గోచరించినై ...

## అందని సందేహం

అగ్ని వీణాతంత్రులపై చిందిపోవు
వధుశీకరానెన్నో?
హిమధామంలో కనుపించని
అగ్నికీలామాలికాలంకృతులెన్నో?
తమఃఫాలఫలకంపై బడి
జారిపోవుకాంతి కళికలెన్నో?
చీకటి అడుగుల జాడ లనంటి
నడవని భయంకర దీర్ఘచ్ఛాయలెన్నో?
కాళనిశాంగన చిరునగవులలో
మొలకలెత్తు దీధితులెన్నో?
తారాగణం మసియయి నశించినా
ఎంతకాలానికీ విరియని ఉషస్సులెన్నో?
ప్రతిమానవహృదయంలో పరిభ్రమించే
ప్రజ్వలించే విశ్వగోళాలెన్నో?
క్రాంతదర్శి మాటలు బాటలుగా మారక
తరలిపోయిన శుభదినాలెన్నో?
విరిసిన అగ్నిపుష్పాల తావులనాశించి
విహరించే తుమ్మెదబారులెన్నో?
నగ్నజీవుల దగ్ధహృదయాల్లో
చివురించని శిథిలాశలెన్నో?

—మాదిరాజు రంగారావు.